

కూలీలకు 'ఉపాధి' శిక్షణ

ఉపాధి హామీ పథకం కూలీలు స్వయం ఉపాధి పొందేలా పలు రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



పెద్దాస్పత్రిలో భయం భయం

పెద్దాస్పత్రి పాత భవనం స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో చికిత్సకు వచ్చిన వారు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ఓపెన్ స్కూల్'ను సద్వినియోగం చేసుకోండి



ముదిగొండలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

నేలకొండపల్లి/ముదిగొండ: ఓపెన్ స్కూల్ విద్యావిధానం ద్వారా పదో తరగతి, ఇంటర్ చదివే అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.పాపారావు సూచించారు. నేలకొండపల్లి, ముదిగొండల్లో గురువారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించడమే కాక వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అనంతరం పాపారావు మాట్లాడుతూ మధ్యలో చదువు మానివేసిన వారే కాకుండా ఉన్నత చదువుపై ఆసక్తి ఉన్న వారు ప్రవేశాలు పొందాలని తెలిపారు. 14 ఏళ్లు నిండితే పదో తరగతి, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్‌లో చేరొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ జమలారెడ్డి, తహసీల్దార్ టి.రామారావుతో పాటు ఉద్యోగులు ఇమ్రాన్, సునీత, అశోక్ రాణి, షేక్ నాజర్, ఉషారాణి, వహిదా, రవీందర్, చిన్నవెంకటేశ్వర్లు, డాక్టర్ అరుణాదేవి, దుర్గామల్లేశ్వరి పాల్గొన్నారు.

22న ట్రైకార్ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ట్రైకార్ రుణాల కోసం 2021–22 ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ఈనెల 22న జరగనుంది. ఈ విషయాన్ని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ధ్రువపత్రాలతో 22న ఉదయం 11 గంటలకు డీపీఆర్‌సీ భవన్ సమీపంలోని గిరిజన భవనానికి హాజరుకావాలని సూచించారు.

20లోగా గృహలక్ష్మి సర్వే పూర్తి



మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 20వ తేదీలోగా గృహలక్ష్మి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సర్వే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఖమ్మంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన ఉద్యోగులతో సమావేశమై మాట్లాడారు. కేఎంసీ పరిధిలోని 60 డివిజన్లలో దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. మొత్తం 6,963 దరఖాస్తులు అందగా, ఇప్పటివరకు 1,710 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ జి.శ్రీనివాస్, ఈఈ కృష్ణాలాల్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

కందుకూరుకు ఎంపీ నిధులు



ఎమ్మెల్యేకు లేఖ అందజేస్తున్న ఎంపీ

వేంసూరు: వేంసూరు మండలం కందుకూరులో సీసీ రోడ్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి ఎంపీ ల్యాండ్స్ నుంచి రూ.60 లక్షలు మంజూరు చేశారు. ఈమేరకు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు గురువారం ఆయన హైదరాబాద్‌లో మంజూరు పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీకి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మేళనం

ఖమ్మం సహకారనగర్: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరేందుకు శనివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసినట్లు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ బాధ్యులు తెలిపారు. ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం మూడు గంటలకు మొదలయ్యే సమావేశంలో టీఎన్జీవోస్, టీజీవోస్ నాయకులే కాకుండా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఈమేరకు జిల్లాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హాజరుకావాలని జేఏసీ బాధ్యులు బుర్రి వినోద్‌కుమార్, పి.ప్రవీణ్, ఎం.డీ.మహ్మద్ అలీ, చంద్రశేఖర్, శేషు, బిందు, ప్రసాద్, మున్నీ కోరారు.



కిషన్‌రెడ్డి పర్యటన ఇలా...

అమిత్‌షా సభ పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం జిల్లాకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వస్తున్నారు. ఉదయం 11గంటలకు వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద ఆయనకు బీజేపీ నాయకులు స్వాగతం పలికి బైక్ ర్యాలీగా జెడ్పీ సెంటర్‌కు చేరుకుంటారు. ఇక్కడ కిషన్‌రెడ్డి ప్రసంగించాక ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ కళాశాల మైదానాన్ని పరిశీలించి సభ ఏర్పాట్లపై సమీక్షిస్తారు. అనంతరం విలేకరులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యకర్తల సన్నాహక సమావేశంలో దిశానిర్దేశం చేస్తారు. ఆతర్వాత స్తంభాద్రి దేవాలయాన్ని దర్శించి పూజలు చేయనున్న కిషన్‌రెడ్డి, ఇటీవల హత్యకు గురైన బీజేవైఎం నాయకుడు కొప్పుల సాయి కుటుంబాన్ని పరామర్శిస్తారు. అలాగే, ఖమ్మం రూరల్ మండలంలోని ముత్తగూడెంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోటమర్తి సుదర్శన్ ఇంటికి వెళ్లి తేనీటి విందు స్వీకరిస్తారు. చివరగా రెడ్డిపల్లిలో పద్మశ్రీ వనజీవి రామయ్యను పరామర్శించనున్న కిషన్‌రెడ్డి రోడ్డు మార్గంలో రాత్రి ఏడు గంటలకు హైదరాబాద్ బయలుదేరతారు.

అటు కారు.. ఇటు కమలం!



- ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలపై బీఆర్ఎస్ కన్ను
- మరింత బలం పెంచుకునే దిశగా చేరికలపై దృష్టి
- కేటీఆర్ సమక్షాన బీఆర్ఎస్‌లో చేరిన 'తెల్లం'
- 27న జిల్లాలో కేంద్ర మంత్రి అమిత్‌షా సభ
- ఏర్పాట్ల పరిశీలనకు నేడు వస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వచ్చే సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఉమ్మడి ఖమ్మం జిల్లాపై దృష్టి సారించారు. ఇప్పటికే ఎన్నికల హడావుడి మొదలైన క్రమంలో ఫోకస్ పెంచారు. ఈసారి ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పదికి పది స్థానాలు గెలవాలనే నినాదంతో బీఆర్ఎస్ ముందుకెళ్తుండగా.. కొంతైనా పట్టు సాధించేందుకు బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇక వ్యూహాలకు పదును పెట్టేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలతో బుధవారం ప్రగతి భవన్‌లో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తెల్లం వెంకట్రావు తిరిగి గులాబీ గూటికి చేరారు. తెలంగాణ భవన్‌లో మంత్రులు కేటీఆర్, పువ్వాడ సమక్షాన గురువారం ఆయన బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. మరోపక్క బీజేపీ సైతం ఖమ్మం జిల్లాకు ప్రత్యేక సమయం కేటాయిస్తోంది. గతంలో వాయిదా పడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభను ఈనెల 27న నిర్వహించేందుకు సన్నద్ధమైంది. ఇందుకోసం నేతలకు సూచనలు చేసేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం ఖమ్మం వస్తున్నారు.

ఒక్కటి కాదు.. పది

గత రెండు పర్యాయాలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వచ్చిన ఫలితాలు బీఆర్ఎస్‌కు మింగుడు పడలేదు. మిగిలిన అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడితే.. ఇక్కడ మాత్రం ఒక్క స్థానానికే పరిమితమైంది. ఆ తర్వాత కాంగ్రెస్, టీడీపీ నుంచి గెలుపొందిన అభ్యర్థులు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో సంఖ్యాపరంగా బీఆర్ఎస్ బలం పుంజుకున్నా క్షేత్రస్థాయిలో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఏం చేయాలనే అంశంపై సీఎం కేసీఆర్ ఫోకస్ పెట్టారు. దీంతో 2018 ఎన్నికల తర్వాత నుంచే ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌ను బలమైన శక్తిగా మార్చేందుకు కేసీఆర్ ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభను ఖమ్మం వేదికగా నిర్వహించి మూడు రాష్ట్రాల సీఎంలతో కలిసి కేసీఆర్ హాజరయ్యారు. అలాగే వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లిన సమయాన బోనకల్ మండలంలో పర్యటించారు. అంతేకాకుండా రెండు రాజ్యసభ స్థానాలు, ఒక ఎమ్మెల్సీ పదవి జిల్లాకు కేటాయించారు. ఇవన్నీ బేరీజు వేసుకుని ఈసారి ఒక్క అసెంబ్లీ స్థానం కాదు.. పది స్థానాల్లో గెలుపొందాలన్న వ్యూహంతో ఆ పార్టీ ముందుకు సాగుతోంది.

అమిత్‌షా సభకు సన్నాహాలు

బీజేపీ కేంద్ర నాయకత్వం ఖమ్మం జిల్లాకు ప్రాధాన్యత కల్పిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీకి ఓటర్లతోపాటు కేడర్ కూడా పెద్దగా లేకపోవడంతో ఏ ఎన్నికల్లోనూ ఒక్క సీటు గెలుచుకోలేదు. అయితే ఆ సంప్రదాయాన్ని మార్చాలనే ఆలోచనలో బీజేపీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మంలో బలం పుంజుకుంటే రాష్ట్రంలోనూ పాగా వేసే అవకాశం ఉంటుందని అగ్రనేతలు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఏ చిన్న అవకాశం దొరికినా అందిపుచ్చుకునేందుకు ఆ పార్టీ సిద్ధమవుతోంది. గతంలో పార్టీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్నప్పుడు ఆందోళనలు నిర్వహించడమే కాక నిరుద్యోగ సమస్యపై అప్పటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యాన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఇంకా పలుమార్లు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల నాయకులు పర్యటిస్తూ కేడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇక హోం మంత్రి అమిత్‌షా జిల్లాకు వస్తారని గతంలో రెండుమార్లు తేదీలు ఖరారైనా వాయిదా పడింది. ఈసారి 27వ తేదీన పర్యటన ఖరారు కావడంతో కార్యకర్తలతో సమావేశమయ్యేందుకు శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఖమ్మం వస్తున్నారు. ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికి బైక్ ర్యాలీగా టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు చేరుకోవాలని జిల్లా నాయకులు నిర్ణయించారు. ఆతర్వాత సభ నిర్వహణకు అనువైన స్థలాలను పరిశీలించి ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఏర్పాట్లు, జన సమీకరణపై ఆయన చర్చించనున్నారు.

చేరికలపై నజర్



మంత్రులు కేటీఆర్, పువ్వాడతో ఎంపీలు వద్దిరాజు, కవిత, ఎమ్మెల్సీ మధు, విప్ కాంతారావు, వెంకట్రావు, లక్ష్మీనారాయణ

వచ్చే ఎన్నికల్లో అంతా ఏకతాటిపై నిలిచి ఉమ్మడి జిల్లాలో జయకేతనం ఎగురవేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగానే వారం రోజులుగా ప్రచారం జరిగినట్లుగా భద్రాచలం నియోజకవర్గ నేత తెల్లం వెంకట్రావును పార్టీలో చేర్చుకునే పనిని శరవేగంగా ముగించారు. ఇటీవల మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి తెల్లం కాంగ్రెస్‌లో చేరారు. అయితే, భద్రాచలంలో కాంగ్రెస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఉండడంతో అక్కడ తనకు టికెట్ రాదన్న ఉద్దేశంతో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోగా.. ఇతర పార్టీల నుంచి మరికొందరు నాయకులను సైతం బీఆర్ఎస్‌లో చేర్చుకునేందుకు నేతలు ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

'నవోదయ'లో సమస్యల పరిష్కారానికి కృషి

అదనపు కలెక్టర్ మధుసూదన్



అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు సమస్యలు విన్నవిస్తున్న తల్లిదండ్రులు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. విద్యాలయంలో గురువారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన తల్లిదండ్రుల నుంచి సమస్యలపై ఆరా తీసి మాట్లాడారు. తొలుత విద్యాలయ ఆవరణలో పరిశీలించగా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం ఉండడంతో వారానికోసారి పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించాలని గ్రామ కార్యదర్శి నరేష్‌ను ఆదేశించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషణం, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లలకు భద్రత కల్పించండి

పిల్లలు క్షేమంగా ఉండేలా భద్రత కల్పించాలని పలువురు తల్లిదండ్రులు అదనపు కలెక్టర్‌ను కోరారు. ఇటీవల విద్యార్థి దుర్గా నాగేందర్ మృతి చెందడానికి గత ప్రిన్సిపాల్ చంద్రబాబు కారణమని, ఆయన కారణంగా పిల్లలు చదువులో వెనుకబడ్డారని, పిల్లలతో అన్ని పనులు చేయించారని ఆరోపించారు. ఈసందర్భంగా నాగేందర్ తల్లిదండ్రులు తమ మాదిరి ఎవరు కూడా పుత్రశోకంతో బాధపడకుండా చూడాలని రోదిస్తూ కోరడం కలిచివేసింది. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ స్పందిస్తూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు ఉపాధ్యాయుల నియామకానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే, దుర్గా నాగేందర్ కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్‌రూం ఇల్లుతో పాటు కుటుంబంలోని ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించనున్నట్లు చెప్పారు.

ఓటు హక్కుపై అవగాహన

- రేపు అన్ని నియోజకవర్గాల్లో 5కే రన్
- వీసీలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: నూతన ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రాముఖ్యత, ఓటు హక్కు వినియోగంపై చైతన్యం తీసుకురావాలని తెలిపారు. ఈమేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శనివారం 5కే రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులోయువ ఓటర్లు, నూతన ఓటర్లను భాగస్వామ్యం చేసి స్వేచ్ఛగా, ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేసేలా చైతన్యపరచాలన్నారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ అన్ని అంశాలపై అవగాహన కలిగేలా ముద్రించిన కరపత్రాలను విరివిగా పంపిణీ చేయాలని సూచించారు.

లక్ష్యాలను సాధించాలి

ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన ఆసరా పింఛన్లు, హరితహారం, జీఓ 59, గృహలక్ష్మి, బీసీ, మైనార్టీలకు ఆర్థిక సాయం పథకాలపై సూచనలు చేశారు. ఈనెల 26న చేపట్టనున్న సామూహిక హరితహారంలో భాగంగా పెద్దసంఖ్యలో మొక్కలు నాటేందుకు ఏర్పాటుచేయాలన్నారు. అలాగే, గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తిచేయాలని, జీఓ 59 దరఖాస్తులకు నోటీసులు జారీ చేసి వసూళ్లలో వేగం పెంచాలని తెలిపారు. ఇంకా పలు అంశాలపై సూచనలు చేశారు. ఈసమావేశాల్లో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఈఓ సోమశేఖర శర్మ, సాంఘిక, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు కె.సత్యనారాయణ, జి.జ్యోతి, మహహూదీ, డీఐఈఓ రవిబాబు, సీపీఓ శ్రీనివాస్, ఆర్డీఓ గణేష్, ఎస్‌బీ ఏసీపీ ప్రసన్నకుమార్, కలెక్టరేట్ అధికకారులు అరుణ, మదన్‌గోపాల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్

'నల్సా' పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఖమ్మంలీగల్: చట్టప్రకారం అర్హులైన వారికి న్యాయపరమైన ప్రయోజనం కల్పించేలా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ(నల్సా) రూపొందించిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. 'నల్సా' పథకాలపై ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లకు గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు బీమా పథకం వర్తింపు, బాల్య వివాహాలను నిరోధం, వృద్ధులు, అసహాయులకు జీవనభృతి చెల్లింపు, మహిళల రక్షణ చట్టాల అమలుకు న్యాయసాయం అందించాల్సిన విషయమై ఆయన మాట్లాడారు. ఇటీవల వరదలతో ఎవరైనా పత్రాలు కోల్పోతే తిరిగి ఇప్పించేలా సాయం అందిస్తామన్నారు. వచ్చేనెల 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈసదస్సులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మొదలైన రైతుబంధు సాయం

ఏడెకరాల వరకు రైతుల ఖాతాల్లో జమ

ఖమ్మంవ్యవసాయం: కొద్దిరోజులుగా నిలిచిపోయిన రైతుబంధు సాయాన్ని ప్రభుత్వం మళ్లీ జమ చేస్తోంది. వానాకాలం పెట్టుబడి సాయం కింద రైతుబంధు పథకం ద్వారా ఎకరాకు రూ.5వేల చొప్పున అందజేయడాన్ని జూన్ 26న ప్రారంభించారు. జిల్లాలో 3,32,893 మంది రైతులను అర్హులుగా గుర్తించి భూమి ఆధారంగా రూ.364.23 కోట్లు కేటాయించారు. ఎకరం ఆ లోపు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో తొలిరోజు నగదు జమ చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియ చేపట్టడంతో రైతుబంధు అమలులో జాప్యం చోటు చేసుకుంది. మళ్లీ గురువారం సాయంత్రం పలువురు రైతుల ఖాతాల్లో నగదు జమ అయింది. ఇప్పటివరకు ఏడు ఎకరాల వరకు భూమి కలిగిన సుమారు 2.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.220 కోట్ల మేర రైతుబంధు సాయం జమ అయి ఉంటుందని అంచనా. పంటల సాగు సమయాన ఓ వైపు రుణమాఫీ పథకం అమలు, మరో వైపు రైతుబంధు నగదు జమ అవుతుండడంతో రైతులకు ప్రయోజనం చేకూరినట్లవుతోంది.

చేరికల సభ వాయిదా..

సీఎం పిలుపుతో హైదరాబాద్ వెళ్లిన వైరా ఎమ్మెల్యే

కారేపల్లి: కారేపల్లిలోని వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరతారని ప్రకటించి... మండల కేంద్రంలోని కార్యాలయ ఆవరణలో సభకు గురువారం ఏర్పాట్లుచేశారు. ఈకార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాములునాయక్ పాల్గొంటారని వెల్లడించారు. ఇంతలోనే సీఎం కేసీఆర్ నుంచి ఫోన్ రావడంతో ఎమ్మెల్యే హైదరాబాద్ బయలుదేరారు. దీంతో సభను వాయిదా వేసినట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉమాశంకర్ తెలిపారు. కాగా, వైరా టికెట్‌పై చర్చించేందుకే ఎమ్మెల్యేను పిలిచిరా, మరేదైనా కారణం ఉందా అనే చర్చ సాగుతోంది.

నేటితో ముగియనున్న టెండర్లు

- వైన్స్‌కు ఈసారి దరఖాస్తులు తగ్గినట్టేనా?
- కొత్త వారు, ఏపీ వ్యాపారులపైనే అధికారుల ఆశలు

ఖమ్మంక్రైం: జిల్లాలోని 122 వైన్స్ కేటాయింపునకు సంబంధించి ఈనెల 4వ తేదీన ప్రారంభమైన టెండర్ల ప్రక్రియ శుక్రవారం ముగియనుంది. అయితే, ఇప్పటివరకు 4,313 దరఖాస్తులు మాత్రమే అందగా, చివరిరోజు భారీగా టెండర్లు నమోదవుతాయని అధికారులు భావిస్తున్నారు. అయితే, మొదటి నుంచి మందకొడిగా దరఖాస్తులు దాఖలు కాగా, చివరలో పుంజుకున్నాయి. కాగా, శుక్రవారంతో గడువు ముగియనుండగా సాయంత్రం ఆరు గంటల వరకు వచ్చిన వ్యాపారులకు టోకెన్లు జారీ చేసి టెండర్లు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

వెనుకబడిన మధిర, సత్తుపల్లి

గత ఎక్సైజ్ పాలసీలో ముందంజలో ఉన్న మధిర, సత్తుపల్లి స్టేషన్ల పరిధిలో ఈసారి దరఖాస్తుదారుల సంఖ్య తగ్గిందని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1, 2తో పాటు సింగరేణి, నేలకొండపల్లి స్టేషన్ల పరిధిలో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని తెలుస్తోంది. అయితే, చివరి రోజు పెద్దసంఖ్యలో టెండర్లు దాఖలయ్యే అవకాశముందని భావిస్తున్నారు. పాత వ్యాపారులే కాకుండా కొత్త వారే కాక పక్క రాష్ట్రం వ్యాపారులు కూడా టెండర్ల దాఖలుకు వస్తారని, తద్వారా గతంతో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య పెద్దగా తగ్గకపోవచ్చనే ఆశతో ఉన్నారు.



ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 వద్ద వ్యాపారుల సందడి

ఇప్పటివరకు 4,313 దరఖాస్తులు

జిల్లాలోని 122 వైన్స్‌కు సంబంధించి ఇప్పటివరకు 4,313 దరఖాస్తులు నమోదయ్యాయి. కాగా, గురువారం ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 పరిధిలోని వైన్స్‌కు 429, స్టేషన్–2 పరిధిలోని వైన్స్‌కు 324 టెండర్లు అందాయి. అలాగే, నేలకొండపల్లి పరిధిలోని వైన్స్‌కు 243, వైరా పరిధిలో 183, మధిర పరిధిలో 215, సత్తుపల్లి పరిధిలో 289 దరఖాస్తులతో పాటు సింగరేణి పరిధిలోని వైన్స్‌కు 78 కలిపి 1,761 దరఖాస్తులు అందాయి.

మూడు సొసైటీలు గల్లంతు

- రుణమాఫీ జాబితాలో కానరాని వైనం
- డీసీసీబీ పరిధిలోని సొసైటీలు లేకపోవడంతో ఆందోళన
- బ్యాంకు పరిధిలో లక్ష మంది రైతుల ఎదురుచూపుల

ఖమ్మంవ్యవసాయం: రైతులు తీసుకున్న పంట రుణాల మాఫీ ప్రక్రియ మూడోవిడతలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలోని మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు గల్లంతయ్యాయి. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం బీరోలు, కూసుమంచి మండలం కల్లూరుగూడెం పీఏసీఎస్‌ల పేర్లు లేకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఖమ్మం డీసీసీబీ పరిధిలో 100 ప్రాథమిక వ్యవసాయ సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వం 2014 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబర్ 11 వరకు రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. జిల్లాలో రుణమాఫీకి 3,25,321 మంది రైతులు అర్హులు కాగా, వీరి రుణాలు రూ.2,428.36 కోట్లు మాఫీ చేయాల్సి ఉంది. ఇందులో డీసీసీబీ పరిధిలోని 1,62,902 మంది రైతులకు సంబంధించి రూ.6,16,97,09,646.73 మాఫీ కావాల్సి ఉంది. అయితే, మిగతా అన్ని చోట్ల ప్రక్రియ సాఫీగానే సాగుతుండగా, ప్రభుత్వం గురువారం వరకు మూడో విడతగా జిల్లాలోని 34,480 మంది రైతుల ఖాతాల్లో రూ.192.52 కోట్లు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.

డీసీసీబీలో నిలిచిన ప్రక్రియ..

ఖమ్మం డీసీసీబీ పరిధిలోని పీఏసీఎస్‌లు జిల్లాల విభజన తర్వాత మూడు జిల్లాల పరిధిలోకి వెళ్లాయి. అయితే, జిల్లాల్లోని మిగతా బ్యాంకులకు సంబంధించి రుణమాఫీ జరుగుతుండగా, డీసీసీబీలో మాత్రం నిలిచిపోయింది. మొత్తం 1,62,906 మంది రైతులకు సంబంధించి రూ.616.97 కోట్ల మేర రుణమాఫీ కావాల్సి ఉంది. మూడు విడతల్లో ఇప్పటి వరకు కేవలం 58,012 మంది రైతులకు సంబంధించి రూ.158.13 కోట్లు మాఫీ అయ్యాయి. ఇంకా 1,04,894 మంది రైతులకు రూ. 458.83 కోట్లు విడుదల కావాల్సి ఉంది.



జిల్లా కేంద్ర సహకార బ్యాంక్

ఉన్నతాధికారులకు సమాచారం..

ఖమ్మం డీసీసీబీ పరిధిలోని మూడు సహకార సంఘాల పేర్లు రుణమాఫీ జాబితాలో గల్లంతయ్యాయని స్థానిక అధికారులు టస్కాబ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అలాగే, పీఏసీఎస్‌ల చైర్మన్లు సైతం మూడో విడత రుణమాఫీ ప్రక్రియలో తమ సంఘాలను చేర్చాలని కోరారు. బయ్యారం పీఏసీఎస్ అధ్యక్షుడు మూల మధుకర్‌రెడ్డి తాజాగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు సమస్యను వివరించి రైతుల జాబితా అందించారు. దీంతో ఆమె రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, టస్కాబ్, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఆ సొసైటీలు ఏవి?

మూడో విడత రుణమాఫీ ప్రక్రియలో డీసీసీబీ పరిధిలోని బయ్యారం, బీరోలు, కల్లూరుగూడెం సహకార సంఘాలు గల్లంతయ్యాయి. వంద పీఏసీఎస్‌ల్లో రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాలు, వారి రుణాల వివరాలను తెలంగాణ రాష్ట్ర కేంద్ర సహకార బ్యాంకు(టస్కాబ్)కు పంపించారు. కానీ జాబితాలో బయ్యారం, బీరోలు, కల్లూరుగూడెం సొసైటీల పేర్లు లేకపోవడం గమనార్హం. ఇందులో బయ్యారం సొసైటీకి సంబంధించి 2,766 మంది రైతులకు రూ. 6.55 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉంది. ఇందులో 1,003 మంది రైతులకు రూ.1.61 కోట్లు మాఫీ కాగా, ఇంకా 1,763 మంది రైతులకు సంబంధించి రూ.5.04 కోట్లు మిగిలిపోయాయి. అలాగే, బీరోలు సంఘంలో 2,549 మంది రైతులకు రూ.7.45 కోట్లగాను గాను 709 మందికి చెందిన రూ.1.38 కోట్లు మాఫీ కాగా, ఇంకా 1,440 మంది రైతుల రూ.6.07 కోట్ల రుణాలు మిగిలిపోయాయి. ఇంకా కల్లూరుగూడెం సంఘంలో 2,324 మంది రైతులకు రూ.7 కోట్ల రుణాలకు గాను 800 మందికి రూ.కోటి మేర మాఫీ కాగా, 1,524 మంది రైతులకు సంబంధించి రూ.6 కోట్లు మాఫీ కావాల్సి ఉండడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్‌గా స్వర్ణాకర్


మర్సకట్ల స్వర్ణాకర్

మధిర: ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్‌గా మధిరకు చెందిన మర్స కట్ల స్వర్ణాకర్ నియమితులయ్యారు. రాష్ట్ర కన్వీనర్ విద్యాసాగర్ నుంచి ఆయన గురువారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తనకు పదవి అప్పగించిన కన్వీనర్ విద్యాసాగర్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణకు స్వర్ణాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

మానసిక వికాస కేంద్రానికి విద్యార్థిని విరాళం


చెక్కు అందజేస్తున్న విద్యార్థిని బంధువులు

ఖమ్మం సహకారనగర్: అమెరికాలో చదువుకుంటున్న కావ్య రచన ఖమ్మం బైపాస్ రోడ్డులోని మానసిక వికాస కేంద్రం విద్యార్థుల కోసం రూ.40వేలను ప్రకటించింది. ఈమేరకు ఆమె తాతయ్య, నానమ్మ చావా రమేష్‌బాబు, సంపూర్ణ గురువారం కేంద్రం నిర్వాహకురాలు చావా కృష్ణవేణికి చెక్కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యూఏలోని ఇంటి వద్ద వంగనారు పెంచి విక్రయించగా వచ్చిన నగదును పంపించిందని తెలిపారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లుతో పాటు ఆళ్ల వెంకట్రావు, సిరిపురపు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ పోటీల్లో విజేతగా అడిషనల్ డీసీపీ


అడిషనల్ డీసీపీని అభినందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏఆర్క్యే, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ఆధ్వర్యాన ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన టెన్నిస్ పోటీల్లో ఖమ్మం ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి విజేతగా నిలిచారు. డబుల్స్ విభాగంలో ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి, కుమారస్వామి పోటీలో పాల్గొనగా ట్రోఫీ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కుమారస్వామిని గురువారం సీపీ విష్ణు ఎస్.వారియర్ అభినందించారు.

అంతర్జాతీయ టోర్నీకి ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ, కోచ్‌లు

ఖమ్మం స్పోర్ట్స్: చైనా దేశంలో జరగనున్న అంతర్జాతీయ కుంగ్-ఫూ చాంపియన్‌షిప్‌లో భారత్ జట్టు తరఫున జిల్లా క్రీడాకారులు ఇద్దరు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉషూలో శిక్షణ తీసుకుంటున్న అన్నాచెల్లెలు పి.సత్యజిత్ చారి, పి.పవిత్రాచారి టోర్నీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి సన్మానించగా, కోచ్‌లు పి.పరిపూర్ణాచారి, ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి, కైలాస్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోండి


చెక్కు అందజేస్తున్న చైర్మన్ ప్రతాపరెడ్డి

ముదిగొండ: ఖాతాదారులు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాపరెడ్డి సూచించారు. ముదిగొండలోని నూతన భవనంలో ఏర్పాటు చేసిన ఏపీజీవీబీ శాఖ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రుణాల చెక్కులు అందజేశాక ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలు, రైతులకు రుణాలతో పాటు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు కూడా రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఎంఓ విజయభాస్కర్, ముదిగొండ బ్రాంచ్ మేనేజర్ రవిచంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,000	7,000
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,400	18,500
పత్తి	7,750	6,000

– ఖమ్మం వ్యవసాయం

కూలీలకు 'ఉపాధి' శిక్షణ

వంద రోజులు పూర్తి చేసిన వారికి భరోసా

- పురుషులు, మహిళలను ఎంపిక చేస్తున్న ఉద్యోగులు
- ఆసక్తి ఉన్న ఉపాధి రంగాల్లో శిక్షణకు కసరత్తు
- జిల్లాలో ఇప్పటికే వెయ్యి మందికి పైగా గుర్తింపు


నేలకొండపల్లి మండలంలో అర్హుల గుర్తింపునకు సర్వే చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

నేలకొండపల్లి: జాతీయ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న కూలీలు ఇప్పటి వరకు మట్టి పనులే చేసేవారు. అది కూడా వంద రోజులు దాటితే లభించేది కాదు. అయితే, వీరికి నిరంతరం పనులు ఉండేలా స్వయం ఉపాధి రంగాలపై శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో నైపుణ్య శిక్షణపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఆసక్తి ఉన్న వారి వివరాలను సేకరిస్తుండగా, విడతల వారీగా ఆసక్తి కలిగిన రంగంలో నైపుణ్య శిక్షణ ఇచ్చి నిరంతరం ఉపాధి లభించేలా చర్యలు చేపడుతారు.

పని లేకపోతే ఖాళీగానే...

జిల్లాలో 3,04,917 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఇందులో 2018–19 నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు వంద రోజులు పూర్తి చేసుకున్న కూలీలు 38,999 కుటుంబాలు ఉంటాయని అధికారిక అంచనా. వీరందరూ వ్యవసాయ సీజన్లలో కూలీ పనులు చేస్తూ, వేసవిలో ప్రభుత్వం సూచించిన పనులకే పరిమితమవుతున్నారు. అదీ లేకపోతే ఖాళీగా ఉండాల్సిందే. ఈనేపథ్యాన ఇతర రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తే ఏడాది పాటు ఉపాధి పొందే అవకాశం ఉంది. గతంలో సైతం కొంతమేర చదివి మానేసిన యువతీ, యువకులకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యం శిక్షణ ఇచ్చి కొన్ని కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మేస్త్రీ, ఇతర రంగాల్లో మెకానిక్‌ల కొరత ఉంది. ఆయా వృత్తులకు డిమాండ్ పెరిగిన నేపథ్యాన ఉపాధి కూలీలకు శిక్షణ ఇప్పిస్తే మెరుగైన ఉపాధి పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది.

మండలానికి 50 నుంచి 100 మంది

ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు తొలి విడత శిక్షణ కోసం మండలానికి 50కు తగ్గకుండా 100 మందికి మించకుండా ఆసక్తి కలిగిన ఉపాధి కూలీలను ఎంపిక చేస్తున్నారు. జిల్లా మొత్తంగా మూడేళ్లలో 38,999 కుటుంబాలు వంద రోజులు పని పూర్తి చేసుకున్నాయి. వీరిలో కనీస విద్యార్హతలు ఉన్న కుటుంబాల గుర్తింపునకు సర్వే చేస్తున్నారు. తొలి విడతలో వారు ఎంచుకున్న రంగంలో శిక్షణ ఇప్పించి, రుణ సాయం కూడా అందించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. అలాగే, పరికరాలను కొనుగోలు, సంస్థల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం నుంచి రుణసాయం అందించనున్నట్లు తెలుస్తోంది.

ఏయే అంశాల్లో...

పురుషులకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మేస్త్రీ, కంప్యూటర్, ఇతర రంగాల్లో శిక్షణ ఇప్పిస్తారు. అలాగే, మహిళలకు అప్పడాల తయారీ, అల్లికలు, మొక్కల పెంపకం, పచ్చళ్లు, పొడులు తయారీ తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లభించే రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే మహిళలు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసుకునేలా రుణ సాయం అందిస్తున్నారు. ఇదే తరహాలో ఇప్పుడు కూడా శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో అర్హులను గుర్తించడంపై అధికారులు దృష్టి సారించారు.

వెయ్యి మందికి పైగానే గుర్తించాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాల వారీగా ఆసక్తి ఉన్న వారిని ఉపాధి శిక్షణ కోసం గుర్తిస్తున్నాం. అవసరమైన విద్యార్హతలు ఉండి, ఆసక్తి ఉన్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో వెయ్యి మంది వరకు గుర్తించాం. త్వరలోనే శిక్షణ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

పెద్దాస్పత్రిలో భయం భయం

ఊడిపడిన పిల్లర్ పెచ్చులు



ఊడి పడిన పెచ్చులు, (ఇన్‌సెట్) పెచ్చులు ఊడిన పిల్లర్

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రి పాత భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడేం జరుగుతోందనని చికిత్స పొందుతున్న వారితో ఆస్పత్రి వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. గురువారం ఉదయం భవనంలో మెట్లు ఎక్కే మార్గంలో పైకప్పు పిల్లర్ పెచ్చులు ఊడి పడ్డాయి. అయితే, ఆ సమయానికి ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. జిల్లా ఆస్పత్రి భవనాన్ని 1968లో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. అందులో ప్రస్తుతం కొంత భాగం వైద్యసేవలకు, మరి కొంత భాగం కార్యాలయం కోసం వినియోగిస్తున్నారు. అయితే, భవనం నిర్మించి 55 ఏళ్లు కావటంతో శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల కురుస్తుండగా, తరచూ స్లాబ్ పెచ్చులు ఊడిపడం సాధారణమైపోయింది. దీంతో ఉద్యోగులే కాక వైద్య సేవలు పొందుతున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇకనైనా అధికాకారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఆలయాలకు రూ.7 లక్షల విరాళం


బాలింతకు కేసీఆర్ కిట్ ఇస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండలో వివిధ ఆలయాల నిర్మాణానికి పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి గురువారం రూ.7లక్షల విరాళాలు అందజేశారు. గ్రామంలో గురువారం రాత్రి పర్యటించిన ఆయన ఆలయ కమిటీల ప్రతినిధులను నగదు అందజేయగా వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేసిన ఎమ్మెల్యే.. బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేశారు. ఆతర్వాత గ్రామానికి చెందిన రామకృష్ణ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిత, నాయకులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించి వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యాన ఏఎన్‌ఎంలు నిరవధిక సమ్మెకు దిగగా, కలెక్టరేట్ వద్ద వారి దీక్షా శిబిరాన్ని నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయకపోగా కొత్త వారిని నియమించాలని నిర్ణయించడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి వారిని రెగ్యులర్ చేయడమే కాక సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమానికి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు, రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజతో పాటు తోట రామాంజనేయులు, గాదె లక్ష్మీనారాయణ, సీహెచ్.సీతామహాలక్ష్మి, సీహెచ్.విజయకుమారి, టి.జయమ్మ, శీలం నాగేశ్వమ్మ, లతకుమారి తదితరులు పాల్గొన్నారు.

విజయ కాలేజీలో అవగాహన సదస్సు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల విజయ ఇంజినీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ట్రాయ్ రీజనల్ కార్యాలయం ఆధ్వర్యాన గురువారం కన్స్యూమర్ ఔట్ రీచ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాయ్ జాయింట్ అడ్వైజర్ కే.వీ.సురేష్ మాట్లాడుతూ దేశంలో ఉన్న నెట్‌వర్క్‌లు, కనెక్షన్లు, తదితర సేవలను వివరించారు. డిజిటల్ ఇండియా ప్రోగాం వినూత్నమైన, విప్లవాత్మకమైన మార్పుకు సంకేతం నిలుస్తుండగా 2025 నాటికి ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం సైబర్ క్రైమ్, సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. డైరెక్టర్ కె.మురళీకృష్ణ, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ భీష్మం, కళాశాల అకడమిక్ డైరెక్టర్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

23న గుంటు మల్లన్న ఆలయంలో వేలం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ట్రంక్ రోడ్డులో ఉన్న శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 23వ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈఓ సీహెచ్.రామకోటేశ్వరరావు తెలిపారు. రెండేళ్ల కాలానికి గాను లడ్డూ విక్రయం, రెండో నంబర్ షాప్‌ను మూడేళ్ల పాటు అద్దెకు ఇచ్చేందుకు వేలం ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు ఉదయం 11గంటలకు చేరుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమెన్నడు?


కొదుమూరులో సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

చింతకాని: ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఇంకా ఎన్నేళ్లకు పరిష్కరిస్తారో ప్రభుత్వం చెప్పాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు పండిట్లు, పీఈటీల అప్‌గ్రేడేషన్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పుట్లూరి వెంకటేశ్వరరెడ్డితో పాటు పోటు శ్రీనివాసరావు, విజయ అమృత్‌కుమార్, ఎం.డీ.రహీముద్దీన్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గద్దె దించేందుకు సిద్ధం



మాట్లాడుతున్న పరమేశ్వర్ నాయక్, పక్కన పొదెం వీరయ్య

భద్రాచలం టౌన్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను గద్దె దించేందుకు కాంగ్రెస్ సైన్యం సిద్ధంగా ఉందని, తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కర్ణాటక మాజీ మంత్రి పరమేశ్వర్ నాయక్ అన్నారు. భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదలపై మోయలేని భారం పడుతోందని విమర్శించారు. ఇక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి వస్తువుపై జీఎస్టీ రూపంలో పసూలు చేస్తున్న ప్రజాధనాన్ని ఏం చేస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌తో పాటు దేశమంతా నిత్యం మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వారిని రక్షించడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. నల్లధనాన్ని వెనక్కు తీసుకొస్తానన్న ప్రధాని నరేంద్రమోదీ, తెలంగాణలో దళితున్ని సీఎం చేస్తానన్న కేసీఆర్ ప్రజలను మోసం చేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు.

తప్పుడు హామీలతో మోసం..


తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

పెనుబల్లి: మోసపూరిత హామీలతో రాష్ట్ర ప్రజలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాడుగుల చిన్నకృష్ణ ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో గురువారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నకృష్ణ మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు తదితర పథకాలేవీ అమలుకాకపోగా, ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో కొత్త పథకాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొర్రా నర్సింహారావు, నాయకులు దొడ్డపనేని కృష్ణయ్య, నాయుడు గోవర్ధన్, ఓరుగంటి రాము, సుంకర సత్యనారాయణ, పేర్ల మహేష్, బానోతు రమేష్, ఓరుగంటి శివ, ఓరుగంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

19న పీఓడబ్ల్యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంమయూరిసెంటర్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల చొరవతో 1974లో ఏర్పడిన పీఓడబ్ల్యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల హక్కుల సాధన, హింసకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు హైదరాబాద్‌లోని సుందయ్య విజ్ఞాన కేంద్రంలో 19న జరిగే సభకు జిల్లా నుంచి భారీగా తరలిరావాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి టి.ఝాన్సీతో పాటు ఆవుల మంగతాయి, బందెల లలిత, చైతన్య, సరోజిని, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కలుపు మందు తాగిన యువకుడు మృతి

సత్తుపల్లి టౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి మండలం రామ గోవిందపురం పంచాయతీలోని కొమురం భీం కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ ఊకే రవీందర్(25) అప్పులు తీర్చలేక మనోవేదనతో ఈనెల 13వ తేదీన కలుపు మందు తాగాడు. దీంతో ఆయనకు కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించిన అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ రవీందర్ గురువారం రాత్రి మృతి చెందాడు. ఆయన తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... నాచేపల్లి నుంచి నేలకొండపల్లికి వస్తున్న నాగరాజు, నాగేశ్వరరావు, నేలకొండపల్లి నుంచి మంగాపురం తండా వెళ్తున్న భూక్యా నాగేశ్వరరావు, తేజావత్ నాగేశ్వరరావు బైక్‌లు నాచేపల్లి బ్రిడ్జి వద్ద గురువారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, నేలకొండపల్లిలో ప్రథమ చికిత్స అనంతరం 108లో ఖమ్మం తరలించారు.

సీనియర్ జర్నలిస్టు మృతికి మంత్రి సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రముఖ పాత్రికేయుడు, సంపాదకులు సీహెచ్‌ఎం వీ.కృష్ణారావు మృతిపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తనను కలచి వేసిందని పేర్కొన్న మంత్రి.. జర్నలిజంలో కృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఓ ప్రకటనలో కొనియాడారు. అలాగే, ఆయన మృతిపై ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర కూడా వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.

కవి యాకూబ్‌కు పలువురి పరామర్శ


యాకూబ్‌ను పరామర్శిస్తున్న వీరభద్రం, నాయకులు

కారేపల్లి: మండలంలోని రొట్టమాకురేవు గ్రామానికి చెందిన ప్రముఖ కవి యాకూబ్ తల్లి హూరాంబీ ఇటీవల మృతి చెందగా గురువారం సంస్మరణ సభ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొని ఆమె చిత్రపటాటం వద్ద నివాళులర్పించాక యాకూబ్, మిగతా కుటుంబీకులను పరామర్శించారు. అలాగే, కవి, జర్నలిస్టు ప్రసేన్, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు భూక్యా వీరభద్రం నాయక్, మెరుగు సత్యనారాయణ, కొండెబోయిన నాగేశ్వరరావు, కె.నరేందర్, తలారి దేవప్రకాశ్, వజ్జా రామారావు, రావూరి వెంకటేశ్వర్లు, తోటకూరి పిచ్చయ్య, పెద్దబోయిన ఉమాశంకర్, అడ్డగోడ ఐలయ్య, ఎం.డీ.హనీఫ్, షేక్ షఫీ, జూపల్లి రాము పాల్గొన్నారు.

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పెనుబల్లి: కిరాణా షాపులో రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా మండలంలోని కారాయిగూడెంలో ఓ కిరాణాషాపులో నిల్వ చేసి 16 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే, సూరే మీనాకుమార్, సూరే ప్రసాద్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖమ్మం క్రైం: జిల్లా కేంద్రంలోని జూబ్లీ క్లబ్ ఏరియాలో గుట్టుగా వ్యభిచారం సాగిస్తున్న ఇంటిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఆ ఇంట్లో కొన్నాళ్లుగా వ్యభిచారం సాగుతోందనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకుని త్రీ టౌన్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.